సాక్షి
జోగులాంబ గద్వాల
మంగళవారం, 10, జనవరి, 2023



ఆటలపై అలసత్వం
ఎస్‌జీఎఫ్ క్రీడల నిర్వహణలో ప్రభుత్వం తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తోంది.
వివరాలు 8లో ▸



నియామకం ఎప్పుడో..?
అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టుల భర్తీ ప్రక్రియ నత్తనడకన కొనసాగుతోంది.
వివరాలు 10లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
32.1 /15.4
రోజంతా చలిగాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. రాత్రికి చలి తీవ్రత మరింత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: ధరూరు మండలంలో రేవుల పల్లి సమీపంలోని 132కేవీ టవర్స్ లైన్ నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో నేడు (మంగళవారం) ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటలకు వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో డీఈ లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల 33కేవీ సబ్ స్టేషన్‌లకు, శెట్టి ఆత్మకూర్, ద్యాగదొడ్డి, నర్సన్ దొడ్డి, ఉప్పేరు గ్రామాలకు, సంబంధింత ఫీడర్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ఈ విషయాన్ని రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

గద్వాల క్రైం: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రంజన్‌రతన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గద్వాల, అయిజ, మానవపాడు తదితర పోలీసు స్టేషన్ పరిధిలో కొందరు సైబర్ నేరస్తుల మాటలు నమ్మి నగదు లావాదేవీల యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవడంతోపాటు వ్యక్తిగత సమాచారం ఇవ్వడంతో కొందరి బ్యాంక్‌ఖాతాల నుంచి నగదును అపహరించినట్లు ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. ఇలాంటి అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఆకర్షణీయమైన పెట్టుబడుల యాప్‌లను నమ్మి మొబైళ్లలో డౌన్‌లోడు చేసుకోవడం, వ్యక్తిగత సమాచారం ఇవ్వడం ద్వారా సైబర్ నేరస్తులు ఖాతాలోని నగదు తస్కరించే అవకాశం ఉందని, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లో బ్యాంకు, ఓటీపీ వివరాలు చెప్పవద్దని ఎస్పీ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించాలి



ఎర్రవల్లిచౌరస్తా: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధత కోసం పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో జిల్లా అధ్యక్షుడు పోగుల రాజేష్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఆయన హాజరై మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు దేశంలోని అన్ని పార్టీలు మద్దతు తెలుపుతున్నా పార్లమెంట్‌లో బీజేపీ పార్టీ బిల్లు పెట్టకుండా మోసం చేస్తుందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అనుకూలంగా మాట్లాడి నేడు అధికారంలో ఉండి వ్యతిరేఖంగా వ్యవహరించడం సరికాదని, ఎస్సీ వర్గీకరణ జరగకపోవడం వల్ల గత 72 సంవత్సరాలుగా విద్యా, ఉద్యోగ రంగాల్లో మాదిగలు తీవ్రంగా నష్టపోయారన్నారు. పోగుల రాజేష్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈ నెల 11న బెంగుళూరులోని వసంత్‌నగర్ అంబేద్కర్ ప్రాంగణంలో ఎమ్మార్పీఎస్ జాతీయ మహా సభ నిర్వహించనునట్లు తెలిపారు.

రైతులకు న్యాయం చేయాలి

శాంతినగర్: భారత్‌మాలా రోడ్డులో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం పెంచి న్యాయం చేయాలని కొంకల గ్రామ రైతులు కలెక్టర్ కార్యాలయంలో సోమవారం వినతి పత్రం అందజేశారు. వడ్డేపల్లి మండలంలోని కొంకల గ్రామ శివారులో నూతనంగా నిర్మిస్తున్న భారత్‌మాల రోడ్డులో భాగంగా భూములు కోల్పోయిన 70 మంది రైతులకు మొదట ఎకరం తరి భూమికి రూ.7.17 లక్షలు, మెట్ట భూమికి రూ.4.50 లక్షలు అందజేశారని, ఇటీవల ప్రకటించిన అవార్డులో భూములు కోల్పోయిన రైతులకు తరి పొలానికి రూ.13 లక్షలు, మెట్ట పొలాలకు రూ.9.50 లక్షలు నిర్ణయించి రైతులకు నోటీసులు పంపారని, దీంతో మొదటి సారి అవార్డు పొందిన 70 మంది రైతులం 50 శాతం డబ్బులు నష్టపోతున్నామన్నారు. ఈవిషయమై కలెక్టర్ కార్యాలయంలో హరికృష్ణారెడ్డి, రవికుమార్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రావు, వినతిపత్రం అందజేశారు.

పేకాట స్థావరంపై దాడి : రూ.90వేలు స్వాధీనం

గట్టు: మండలంలోని పెంచికలపాడు గ్రామ శివారులోని పేకాట స్థావరంపై సోమవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ టీం దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో రూ.90,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గట్టు మండలానికి చెందిన ముగ్గురు, మల్దకల్ మండలానికి చెందిన 5 మంది వ్యక్తులు పేకాడుతుండగా దాడులు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అడ్డంకులు..!



గద్వాల మున్సిపాలిటీలో వేలం నిర్వహించే దుకాణ సముదాయం ఇదే..

గద్వాల మున్సిపల్ షాపులకు వేలం నిర్వహించకుండా తెరచాటు ప్రయత్నాలు

- కోర్టుకు సైతం వెళ్లేందుకు రూ.20లక్షల వరకు వసూళ్లు
- వేలం పాటపై కానరాని ప్రచారం
- 74షాపులకు కేవలం 20 దరఖాస్తుల విక్రయం
- కొందరు అధికారుల సహకారంపై అనుమానాలు



గద్వాల మున్సిపాలిటీ

గద్వాల రూరల్: గతంలో మున్సిపల్ షాపులను కొందరు వేలంలో దక్కించుకున్నారు.. కాలపరిమితి పూర్తయ్యాక సైతం అలాగే కొనసాగారు.. ఏళ్లు గడిచినా షాపులు ఖాళీ చేయకపోగా తక్కువ అద్దెలతో ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారు.. ప్రస్తుతం వేలం నిర్వహించేందుకు అధికారులు నోటిఫికేషన్ ఇచ్చి తగుచర్యలు చేపట్టగా రకరకాల కారణాలు చూపుతూ అడ్డంకులు సృష్టించేందుకు అక్రమార్కులు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదీ గద్వాల మున్సిపాలిటీలోని ప్రస్తుత పరిస్థితి. ఈ అంశాలను ప్రస్తావిస్తూ 'సాక్షి' వరుస కథనాలు ప్రచురించిన విషయం విధితమే. ఇదిలాఉండగా, ఈ అక్రమార్కులకు మున్సిపల్ కార్యాలయంలోని కొందరు అధికారులు, సిబ్బంది లోపాయికారిగా సహకరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కాలపరిమితి తీరినా మీనమేషాలు

గద్వాల మున్సిపాలిటీకి పెద్ద వర్తక కేంద్రంగా పేరుంది. ఇక్కడ నిత్యం రూ.పది కోట్ల వరకు వివిధ రకాల వ్యాపార లావాదేవీలు కొనసాగుతుంటాయి. ఇంతటి ప్రాధాన్యత ఉన్న మున్సిపాలిటీలో వర్తక దుకాణాలకు సంబంధించి కూడా అద్దెలు ఎక్కువగానే ఉన్నాయి. అయితే గద్వాల మున్సిపల్ పరిధిలోని 30ఏళ్ల కాలపరిమితి విధిస్తూ సుమారు 35ఏళ్ల కిందట నిర్వహించిన షాపులకు మాత్రం నామమాత్రపు అద్దెలే ఉండడం ఒకింత ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. మెయిన్ బజారులో ఉన్న దుకాణాలకు కనిష్టంగా రూ.597, గరిష్టంగా రూ.6,127 అద్దె మాత్రమే ఉంది. వాస్తవానికి ఇదే ప్రాంతంలో ప్రైవేటు దుకాణాలకు సంబంధించి కనిష్టంగా రూ.25–30వేల మధ్య అద్దెలు ఉన్నాయి. అంటే మున్సిపల్ ఖజానాకు ఎంత పెద్ద ఎత్తున గండిపడుతుందో స్పష్టమవుతుంది. నిబంధనల ప్రకారం ఈ షాపులకు కాలపరిమితి తీరిపోయినప్పటికీ తిరిగి వేలం పాట నిర్వహించడంలో మున్సిపల్ శాఖ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. అయితే, కాలపరిమితి తీరిన షాపులకు వెంటనే వేలం నిర్వహించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేయడంతో ఎట్టకేలకు మున్సిపల్ అధికారులు స్పందించారు. ఈనెల 24వ తేదీన 74షాపులకు తిరిగి వేలం నిర్వహించాలని నిర్ణయించారు.

అధికారుల సహకారం

అవినీతికి అలవాటు పడిన కొందరు మున్సిపల్ అధికారులు షాపులకు వేలం నిర్వహించకుండా అవసరమైన సహకారాన్ని అందిస్తున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగానే అక్రమార్కులకు కోర్టుకు వెళ్లేలా అవకాశాన్ని కల్పిస్తూ పాత మున్సిపల్ షాపుల యజమానులతో కొంతమంది వద్ద అడ్వాన్స్ రూపంలో అద్దెలను వసూలు చేసినట్లు వెలుగు చూసింది. ఇలా అడ్వాన్స్ అద్దెలను చెల్లించినట్లు కోర్టులో చూపెట్టి షాపుల వేలం పాటను అడ్డుకోవాలన్నదే ప్రధాన కుట్రగా కనిపిస్తుంది.

అడ్డుకునేందుకు కుట్ర

హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో అదనపు కలెక్టర్ అపూర్వ్‌చౌహాన్ స్పందించి ఈనెల 24వ తేదీన 74షాపులకు వేలం నిర్వహించేలా అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి వేలం పాట నిర్వహణ ప్రక్రియ వేగవంతంగా సాగుతుంది. అయితే వేలం పాట నిర్వహించకుండా అడ్డుకునేందుకు మున్సిపాలిటీలో తమకు అనుకూలంగా ఉన్న కొందరు అధికారుల సాయంతో అక్రమార్కులు మరోసారి కుట్రలు చేస్తున్నారు. వేలం పాట అడ్డుకోవాలంటే డబ్బులు ఖర్చు అవుతాయని చెబుతూ ఓ ఫర్టిలైజర్ యజమాని పాత షాపుల యజమానులతో డబ్బులు వసూళ్లకు తెరలేపారు. ఇందులో రూ.5లక్షల వరకు తమకు సహకరిస్తున్న మున్సిపల్ అధికారులకు, మరికొంత కోర్టు ఖర్చులకు అవుతాయని నమ్మబలికారు. ఇప్పటికే సుమారు రూ.20లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం.

షాపుల వేలంపై ప్రచారం ఏదీ..?

షాపులను వేలం పాట నిర్వహించాలంటే పెద్ద ఎత్తు ప్రచారం చేస్తేనే ఎక్కువ మంది వేలం పాటలో పాల్గొంటారు. తద్వారా మున్సిపాలిటీ ఎక్కువ ఆదాయం సమకూరుతుంది. అయితే ఇక్కడ మాత్రం అలా జరగడం లేదు. ఈనెల 24వ తేదీన 74షాపులకు వేలం పాట నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించి వేలం పాటలో పాల్గొనే దరఖాస్తులను డిసెంబర్ 31వ తేదీ నుంచి విక్రయిస్తున్నారు. అయితే పది రోజులు అయినా కేవలం 20 దరఖాస్తులు మాత్రమే విక్రయించినట్లు మున్సిపల్ అధికారులు చెబుతున్నారంటే వేలం పాట నిర్వహణపై మున్సిపల్ అధికారుల చిత్తశుద్ధిని తెలియజేస్తుంది. వాస్తవానికి పట్టణంలోని ప్రధాన కూడళ్లలో పెద్ద ఎత్తున ఫెక్సీలు ఏర్పాటు, కరపత్రాలు పంపిణీ వంటివి చేపడితే ఎక్కువ మందికి తెలిసి మున్సిపాలిటీకి ఆదాయం వస్తుంది. కాని ఇప్పటి వరకు ఆదిశగా చర్యలు కనిపించడం లేదు.

వేలంపాట తప్పక నిర్వహిస్తాం

మున్సిపాలిటీలో షాపుల వేలం పాట నిర్వహణపై విస్తృతమైన ప్రచారం కల్పించేలా చర్యలు తీసుకుంటాం. అడ్వాన్స్ రూపంలో డబ్బులు వసూలు చేసిన అద్దెల విషయం నా దృష్టికి వచ్చింది. వాటిని తిరిగి వెనక్కి ఇచ్చేస్తాం. సాల్వేన్సీ సర్టిఫికెట్ జారీలో తహసీల్దార్‌కు స్పష్టమైన ఆదేశాలిచ్చాం. ఎవరు ఎలాంటి కుట్రలు చేసినా షాపులకు వేలం పాట నిర్వహిస్తాం. అక్రమార్కులకు సహకరిస్తే అధికారులపై కూడ చర్యలు తీసుకుంటాం.

– అపూర్వ్‌చౌహాన్, అడిషనల్ కలెక్టర్

ఆర్టీఏ దూకుడు

పన్ను వసూళ్లలో ఉమ్మడి జిల్లా ముందంజ



గద్వాలలో వాహన పత్రాలు పరిశీలిస్తున్న ఆర్టీఏ అధికారులు

- 2022- 23 ఆర్థిక సంవత్సరం లక్ష్యం రూ.232.25 కోట్లు
- గత డిసెంబర్ నాటికే రూ.194.46 కోట్లు వసూలు
- ఫీజులు, జీవితకాల పన్ను ద్వారానే అధిక ఆదాయం
- మరో మూడు నెలల గడువులోగా సునాయాసంగా ఛేదన
- సిబ్బంది కొరతను అధిగమించి ముందుకు..

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి జిల్లా ఆర్టీఏ అధికారులు పన్నుల వసూళ్లలో దూకుడు ప్రదర్శిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం విధించిన లక్ష్యం కంటే ఎక్కువ మొత్తంలో పన్ను వసూలు చేసి రాష్ట్రస్థాయిలో జిల్లాకు మంచిస్థానం తీసుకువచ్చారు. జిల్లా ఆర్టీఏ శాఖలో సిబ్బంది కొరత ఉన్నా.. లక్ష్యం సాధించడంలో ఎక్కడా వెనకడుగు వేయలేదు. మొదటి నుంచి ప్రణాళికతో వెళ్లి రోజు సాధారణ కార్యాలయ పనులతోపాటు విజిలెన్స్ బాధ్యతలు నిర్వర్తిస్తూనే.. జిల్లా రవాణా శాఖ ప్రభుత్వం ఇచ్చిన పన్ను వసూళ్ల లక్ష్య సాధనలో ముందంజలో నిలిచింది. ఇలా ఈ ఒక్క ఏడాదే కాకుండా వరుసగా గత నాలుగేళ్ల నుంచి రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో రావడం గమనార్హం. 2022 ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు గాను ఉమ్మడి జిల్లా ఆర్టీఏ శాఖకు రాష్ట్ర ప్రభుత్వం రూ.232.25 కోట్లను లక్ష్యంగా నిర్ణయించారు. ఇందులో డిసెంబర్ 31 నాటికి రూ.174.19 కోట్ల లక్ష్యం విధించగా.. రూ.194.46 కోట్లు వసూలు చేశారు. ఈ లెక్కన రూ.20.27 కోట్ల (111.64 శాతం)ను ఎక్కువగా వసూలు చేసి రాష్ట్రస్థాయిలో ఉత్తమ స్థానంలో నిలిచారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా మూడు నెలల గడువు ఉన్నప్పటికీ ఇచ్చిన లక్ష్యం కంటే అదనంగా వసూలు చేసి భేష్ అనిపించుకున్నారు.

లక్ష్యానికి మించి..

మహబూబ్‌నగర్ జిల్లాలో డిసెంబర్ వరకు త్రైమాసిక పన్నుల లక్ష్యం రూ.10.09 కోట్లు కాగా రూ.12.80 కోట్లు వసూలు చేశారు. అలాగే జీవితకాల పన్ను రూ.41.55 కోట్లకు గాను.. రూ.44.71 కోట్లు, వివిధ రకాల ఫీజుల ద్వారా రూ.7.98 కోట్లకు గాను.. రూ.9.41 కోట్లు, సర్వీస్ చార్జీల ద్వారా రూ.2.66 కోట్లకు గాను.. రూ.2.15 కోట్లు వసూలు చేశారు. వాహనాలకు జరిమానాలు, అధిక లోడ్, పత్రాలు లేకుండా, డ్రైవర్‌కు లైసెన్స్ లేకుండా తిరిగే వాహనాలకు జరిమానాలు విధించడానికి చేసిన తనిఖీల ద్వారా రూ.1.86 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా.. రూ.3.38 కోట్లు వసూలయ్యాయి. జిల్లా ఆర్టీఏ శాఖ జీవితకాల పన్నుతోపాటు ఫీజులు, తనిఖీల ద్వారా అధిక ఆదాయం వచ్చింది. అయితే ఈ ఏడాది సర్వీస్ ఫీజులతో వచ్చిన ఆదాయం కొంత వరకు తగ్గింది. ప్రతిరోజు తనిఖీలు చేయాలని లక్ష్యం ఉన్నప్పటికీ సిబ్బంది కొరతతో చేయలేకపోతున్నారు. ఉన్న అధికారులు రోడ్లమీద వాహన తనిఖీలకు వెళ్తే కార్యాలయంలో పనులు నిలిచిపోతున్నాయి.

గద్వాల వెనకబాటు

ఈ ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా పన్ను వసూలు చేసింది మహబూబ్‌నగర్ జిల్లా కాగా.. జోగుళాంబ జిల్లా వెనకబడింది. గద్వాల జిల్లాకు సంబంధించి డిసెంబర్ నాటికి రూ.34.88 కోట్లు వసూలు చేయాలని లక్ష్యం నిర్దేశించగా రూ.30.45 కోట్లు మాత్రమే వసూలు చేశారు. నారాయణపేట జిల్లాలో మాత్రం డిసెంబర్ నాటికి రూ.13.07 కోట్లకు గాను రూ.20.33 కోట్లు వసూలు చేశారు. ఇచ్చిన లక్ష్యం కంటే అదనంగా రూ.7.26 కోట్లు వసూలయ్యాయి.

విరివిగా అవగాహన కార్యక్రమాలు

గ్రామాల్లో వాహనాదారులకు పన్నులు చెల్లించకపోతే భవిష్యత్‌లో కలిగే నష్టాలపై ఆర్టీఏ అధికారులు గ్రామాల్లో పర్యటించి అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలతో పన్నులు కట్టిస్తున్నారు. మొదట వేసిన పన్ను చెల్లించకపోతే భవిష్యత్‌లో దానిని మూడింతలు చెల్లించాల్సి ఉంటుందని, ఫలితంగా మీరే నష్టపోతారని అవగాహన కల్పిస్తున్నారు.

జిల్లాల వారీగా (డిసెంబర్ వరకు) పన్ను వసూలు వివరాలు..

జిల్లా	లక్ష్యం (రూ.కోట్లలో..)	వసూలు చేసింది (రూ.కోట్లలో..)	శాతం
మహబూబ్‌నగర్	86.98	72.45	111.06
నాగర్‌కర్నూల్	48.89	43.88	119.67
వనపర్తి	32.44	27.35	112.41
జోగుళాంబ గద్వాల	46.51	30.45	87.29
నారాయణపేట	17.43	20.33	155.52

జోగుళాంబ గద్వాలలో..

పన్ను రకాలు	కేటాయించింది (రూ.కోట్లలో..)	వసూలైంది (రూ.కోట్లలో..)
త్రైమాసికం	4.13	5.39
జీవితకాలం	14.4	15.14
ఫీజులు	2.98	3.8
సర్వీస్ ఫీజులు	1.4	1.29
తనిఖీలు	11.54	4.83

అధిక లోడ్.. పత్రాలు

జిల్లాలో జాతీయ రహదారి ఉండటంతో అధిక లోడ్ కలిగిన వాహనాలు అధిక సంఖ్యలో వెళ్తుంటాయి. అలాంటి వాహనాలపై ఆర్టీఏ శాఖ కొరడా ఝులిపిస్తోంది. అలాగే పత్రాలు లేని వాహనాలు కూడా అధిక సంఖ్యలో తిరుగుతుండటంతో పన్నులు వసూలు చేస్తున్నారు. ఇలాంటి వాహనాల కోసం ఆర్టీఏ శాఖ వారు ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు.

కేసులు పెరిగాయి..



ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే 112 శాతం పన్ను వసూలు చేశాం. విజిలెన్స్‌తోపాటు ఆర్టీఏ బృందాలు అధిక కేసులు రాయడం వల్ల ఆదాయం పెరిగింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు పన్ను వసూలులో రాజీ పడటం లేదు. జిల్లాలో నిత్యం ప్రత్యేక టీంలు తనిఖీలు చేపడుతున్నాయి. పన్ను చెల్లింపులో ఎవరూ నిర్లక్ష్యం చేయకుండా అవగాహన కల్పిస్తున్నాం. ఫలితంగా అందరూ సకాలంలో చెల్లించేందుకు ముందుకు వస్తున్నారు. – నరేష్, ఎంవీఐ మహబూబ్‌నగర్

పేదల పట్టాలు తిరిగి ఇవ్వాలి

గద్వాల రూరల్: పదేళ్ల కిందట డీకే అరుణ మంత్రిగా ఉన్న సమయంలో 1,500 మంది పేదలకు ఇళ్ల స్థలాలను ఇవ్వగా.. తాజాగా ఆ స్థలంలో ఆసుపత్రి, నర్సింగ్ కాలేజీల నిర్మాణం కోసం శంకుస్థాపన చేయడం దారుమని బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు మండిపడ్డారు. సోమవారం వారు ఇళ్ల పట్టాల లబ్ధిదారులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా ఆయా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. పేదలకు ఇళ్లస్థలాల పట్టాలు ఇచ్చే క్రమంలో కొనుగోలు చేసిన భూమికి సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన పరిహారం సరిపోకపోతే డీకే అరుణ సొంతంగా ఎకరాకు రూ.60వేలు అదనంగా ఇచ్చి పేదలకు పట్టాలు ఇచ్చారన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యేకు వీలైతే పేదల స్థలాల్లో ఇళ్లు కట్టించి అండగా నిలబడాలి కాని ఇలా పేదల ఉసురు తీయొద్దన్నారు. దౌర్జన్యంగా పేదల స్థలాల్లో నిర్మాణాలు జరుగుతుంటే దీనిని నిరసిస్తూ బాధితులు హైకోర్టుకు వెళ్లడం జరిగిందని హైకోర్టు పేదలకు అనుకూలంగా ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ హైకోర్టు ఉత్తర్వులను సైతం అమలు చేయడం లేదని ధ్వజమెత్తారు. తక్షణమే హైకోర్టు ఇచ్చిన ఉత్వర్వులను అమలు చేయాలని వారు డిమాండు చేశారు. అంతకు ముందు ఇళ్ల స్థలాల లబ్ధిదారులతో కలిసి పట్టణంలోని పాతబస్టాండు నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ అపూర్వ్‌చౌహాన్‌కు వినతిపత్రంతో పాటు హైకోర్టు ఉత్తర్వుల పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు, వెంకట్రాములు, కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకర్, ఇసాక్, కౌన్సిలర్లు కుమ్మరి శ్రీనివాసులు, పి.వెంకటేష్, నర్సింహులు, కిరణ్, సత్యం, ప్రవీణ్, రజక జయశ్రీ, రజక నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



అడిషనల్ కలెక్టర్ అపూర్వ్ చౌహాన్‌కు వినతి పత్రం అందజేస్తున్న అఖిలపక్షం నాయకులు

మృతికి కారకులపై చర్య తీసుకోవాలి



డీఎస్పీ రంగస్వామికి ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి తల్లిదండ్రులు

గద్వాల అర్బన్: తమ కుమారుడి ఆత్మహత్యకు కారణమైన కళాశాల గుర్తింపు రద్దుతో పాటు లెక్చరర్, యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ధరూరు మండలం గార్లపాడుకి చెందిన మృతుడి తల్లిదండ్రులు డీఎస్పీ రంగస్వామికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. సోమవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ.. తమ కుమారుడు వెంకటేష్ (18) గద్వాలలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో బైపీసీ సెకండియర్ చదువుతూ గత నెల 15న పట్టణంలోని గంజిపేట కాలనీలో తాను అద్దెకు ఉంటున్న నివాసంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని వివరించారు. మృతికి కారణమైన కళాశాల యాజమాన్యంపై, ఓ లెక్చరర్‌పై చర్య తీసుకోవాలని పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, కేసు నమోదై 25 రోజులు గడిచిన ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ నెల 2న హైదరాబాద్‌లోని ఇంటర్మీడియట్ బోర్డుకమీషనర్‌కు సైతం ఫిర్యాదు చేశామని, కళాశాల నిర్వాహకుడికి జిల్లాలోని కొందరు ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులతో సత్సంబంధాలు ఉండడంతో చర్యలకు వెనకడగుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని డీఎస్పీని కోరారు. కేసు నమోదు చేశామని, విచారణ మరింత వేగవంతం చేస్తామని డీఎస్పీ తెలిపినట్లు వారు వివరించారు.

మైనార్టీ గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు

గద్వాల అర్బన్: గద్వాలలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో మైనార్టీలకు 60, బీసీలకు 10, ఎస్సీలకు 5, ఎస్టీలకు 3, ఒబిసిలకు 2 సీట్లు ఖాళీగా ఉన్నాయని, బ్యాగ్‌లాగ్ సీట్లు మైనార్టీలకు 7వ తరగతిలో మైనార్టీలకు 10 సీట్లు మిగిలి ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆయా తరగతుల ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని, తమ సరిఫికెట్స్‌తో పాఠశాలలో సంప్రదించాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

గద్వాల రూరల్: సమస్యలపై ఇచ్చిన ఫిర్యాదులను తప్పకుండా పరిష్కరించాలని, నిర్లక్ష్యం వహించొద్దని అడిషనల్ కలెక్టర్ అపూర్వ్‌చౌహాన్ ఆదేశించారు. సోమవారం ఫిర్యాదుల దినోత్సవం సందర్భంగా ఆయన కలెక్టరేట్‌లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలతో నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 64 ఫిర్యాదులు వచ్చాయని, వీటిలో 52ఫిర్యాదులు ధరణికి సంబంధించినవి కాగా, 8 ఆసరా పింఛన్లు, మరో 4డబుల్ బెడ్రూంలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. వీటిని ఆయా శాఖలకు చెందిన అధికారులకు పంపడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రాములు, కలెక్టరేట్ ఏవోలు యాదగిరి, తదతరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు 9 అర్జీలు

గద్వాల క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు భూ వివాద, కుటుంబ, ఆస్తి తగాదాలపై 9 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఎస్పీ రంజన్‌రతన్ కుమార్ మాట్లాడుతూ.. సివిల్ కేసులను కోర్టులో పరిష్కారం చేసుకోవాలని, మిగతా వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు.



ఆదిశిలా క్షేత్రం హుండీ ఆదాయం రూ.20.11లక్షలు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరి, ఈఓ సత్యశ్చంద్రారెడ్డి ఆధ్వర్యంలో లెక్కించారు. ఆలయ ఆవరణలోని కల్యాణ మండపంలో నిర్వహించిన హుండీ లెక్కింపులో రూ.20,11,734 వచ్చాయని, గతేడాదితో పోలిస్తే రూ.3,64,772లు అధికంగా వచ్చినట్లు ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు తెలిపారు. చింతలాముని హుండీ ఆదాయం రూ.1,04,074 వచ్చిందన్నారు. హుండీ లెక్కింపులో గట్టు భ్రమరాంబిక సేవాసమితి, అరెకటిక, ఆర్యవైశ్య, రేణుక ఎల్లమ్మ మహిళా సంఘం, ఎస్‌వీఎస్ సేవాసమితి మహిళలతోపాటు మధుసూదన్‌రెడ్డి, సీతారామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, చంద్రశేఖర్‌రావు, నాగరాజు శర్మ,అభిలాష్ పాల్గొన్నారు.



హుండీ లెక్కిస్తున్న మహిళలు

క్లుప్తంగా

వివాహిత అనుమానాస్పద మృతి


పార్వతమ్మ (ఫైల్)

అయిజ: మండలంలోని ఉప్పలలో ఆదివారం రాత్రి పార్వతమ్మ (26) అనుమానాస్పదంగా మృతి చెందింది. ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈడుగోనిపల్లికి చెందిన పార్వతమ్మకు ఉప్పలకు చెందిన గొల్ల కృష్ణతో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వారికి కూతురు, కొడుకు ఉన్నారు. అయితే ఆదివారం ఉప్పలలో వారి సొంత ఇంటిలో పార్వతమ్మ మృతిచెందింది. భర్త గొంతు నులిమి చంపాడని ఈడుగోనిపల్లికి చెందిన పార్వతమ్మ బంధువులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సోమవారం సంఘటన స్థలం చేరుకొని పంచనామా చేశారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


తిమ్మప్ప(ఫైల్)

అయిజ: పొలం పనులకు వెళ్లిన రైతు విద్యుదాఘాతంతో మృతిచెందిన సంఘటన అయిజ పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపిన వివారాలు ఇలా ఉన్నాయి. ఆదివారం సాయంత్రం పొలం పనులకు వెళ్లిన బోయ తిమ్మప్ప(45) విద్యుత్ వైర్లు సరిచేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు సోమవారం సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతదేహానికి పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు. తిమ్మప్ప అంత్యక్రియలకు పట్టణానికి చెందిన హమాలి కార్మికులు బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేశారు.

ముగ్గురి రిమాండ్

గద్వాల క్రైం: అకారణంగా ఒకరిపై దాడి చేసిన సంఘటనలో ముగ్గురు యువకులను సోమవారం రిమాండ్‌కు తరలించామని పట్టణ రెండో ఎస్ఐ అబ్దుల్‌షుకుర్ తెలిపారు. 15 రోజుల క్రితం రాఘవేంద్ర కాలనీకి చెందిన వషీ చికెన్ కొనుగోలు కోసం దగ్గరలోని చికెన్ షాపునకు వెళ్లాడు. అయితే క్రిష్ణారెడ్డి బంగ్లాకు చెందిన నవీన్, రఘు, వెంకటేష్ సదరు యువకుడితో అకారణంగా ఘర్షణ పడ్డారు. దాడిచేయడంతో వషీకి తీవ్ర రక్తగాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. దాడి చేసిన యువకులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచడంతో రిమాండ్‌కు ఆదేశించారని ఎస్ఐ తెలిపారు.

రైతు వేదికలో చోరీ

బాలానగర్: మండలంలోని కేతిరెడ్డిపల్లి రైతువేదికలో ఫ్యాన్లు, టేబుల్, మైక్ సెట్ చోరీకి గురైనట్లు మండల వ్యవసాయ అధికారి ప్రశాంత్ రెడ్డి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు

దేవరకద్ర రూరల్: ఇంటి నుంచి బయటికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది.. ఎస్ఐ భగవంత్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని పెద్ద గోప్లాపూర్‌కి చెందిన చింతకాయల రవి 5 నెలల కిందట ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకి లభించకపోవడంతో బాధితుడి భార్య చంద్రకళ సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ధాన్యం కమీషన్ ఇప్పించాలి

కల్వకుర్తి టౌన్: వరి కొనుగోలు కేంద్రాలను నిర్వహించిన మహిళా సంఘాల సభ్యులకు గత రబీలో నిర్వహించిన కొనుగోలు కేంద్రాలకు రావాల్సిన కమీషన్ డబ్బులను ఇవ్వలేదని మహిళలు రాస్తారోకో నిర్వహించారు. సోమవారం పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో కార్యక్రమాన్ని చేపట్టారు. కమీషన్ డబ్బులు ఇప్పించాలని గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని వారు వాపోయారు. కేంద్రాన్ని నిర్వహించిన మాలతీకి తెలియకుండా ఆమెకు సహాయకంగా వ్యవహరించిన శారద, శాంతమ్మకు మహిళా సంఘం తీర్మానం లేకుండానే చెక్కులు ఇవ్వటం జరిగిందని వారు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ తన సొంత నిర్ణయాలతో వారికి చెక్కులు ఇవ్వాలని ఒత్తిడి తేవటం సరికాదని ఆరోపించారు. రాస్తారోకోతో వాహనాలు రోడ్డుపై నిలిచిపోవడంతో విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని వారిని సముదాయించి రాస్తారోకో విరమింపచేశారు. మాకు న్యాయం జరిగే వరకు నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని వారు తెలిపారు. రాస్తారోకోలో పట్టణ మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.


రాస్తారోకో చేస్తున్న మహిళా సంఘాల సభ్యులు

ఆటలపై అలసత్వం


జిల్లాకేంద్రంలో నిర్వహించిన జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ క్రికెట్ టోర్నీ(ఫైల్)

- రెండేళ్లుగా నిర్వహణకు నోచుకోని ఎస్‌జీఎఫ్ క్రీడలు
- ఈ ఏడాది జనవరి వచ్చినా వీడని సందిగ్ధం
- ఇప్పటి వరకు జిల్లాలకు కేటాయించని టోర్నీలు
- క్రీడలకు దూరమవుతున్న ఔత్సాహిక క్రీడాకారులు

మహబూబ్‌నగర్ క్రీడలు: పాఠశాల, కళాశాల స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. ఎస్‌జీఎఫ్ క్రీడల్లో ప్రతిభ చాటిన ఎంతోమంది ఉమ్మడి జిల్లా విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడల్లో రాణించారు. ఎస్‌జీఎఫ్ క్రీడలకు విద్యార్థులకు ఒక వేదికగా మారుతుంది. ప్రతి ఏడాది పాఠశాల, కళాశాల స్థాయిలో అండర్- 14, అండర్- 17, అండర్- 19 విభాగాల్లో బాల, బాలికలకు వేర్వేరుగా జిల్లాస్థాయిలో ఎంపికలు, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో క్రీడాపోటీలు నిర్వహిస్తారు. పాఠశాల విద్యాసంవత్సరం ప్రారంభం అనంతరం జిల్లాలోని పీఈటీలతో సమావేశం నిర్వహించి.. ఆ తర్వాత ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీల సెలక్షన్స్‌పై నిర్ణయం తీసుకుంటారు. ప్రతి ఏడాది జూలై చివరి వరకు మండల, ఆగస్టు, సెప్టెంబర్‌లో జిల్లా స్థాయి తదనంతరం ఉమ్మడి జిల్లాల క్రీడల సెలక్షన్స్ నిర్వహిస్తారు.

కరోనా వ్యాప్తితో..

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల నిర్వహణపై కరోనా మహమ్మారి తీవ్ర ప్రభావం చూపింది. కోవిడ్ వ్యాప్తి నేపథ్యంలో రెండేళ్ల నుంచి క్రీడా సెలక్షన్స్, టోర్నీలు నిర్వహించలేదు. 2020లో జిల్లాకు కేటాయించిన జాతీయస్థాయి అండర్- 17 బాలికల క్రికెట్ టోర్నీ, అండర్- 17, అండర్- 19 టెన్నికాయిట్ టోర్నీలు కరోనా మహమ్మారితో రద్దయ్యాయి.

జిల్లాల ప్రతిపాదనలతోనే..

తెలంగాణ జిల్లాలకు వారి ప్రతిపాదనల మేరకు రాష్ట్ర, జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా టోర్నీలను కేటాయిస్తారు. ఆయా జిల్లాల ప్రతిపాదనలను తీసుకొని క్రీడా టోర్నీలను నిర్వహిస్తారు. అయితే ఈసారి జిల్లాలకు క్రీడా టోర్నీల కేటాయింపులు కూడా ఇప్పటి వరకు జరగలేదు. గతంలో ఆయా జిల్లాల ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శులతో రాష్ట్రస్థాయిలో సమావేశం నిర్వహించి అందులో క్రీడాటోర్నీల కేటాయింపులు చేసేవారు. ఈ ఏడాది రాష్ట్రస్థాయి సమావేశం కూడా ఇప్పటి వరకు నిర్వహించలేదని తెలుస్తోంది.

➩ జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడల నిర్వహణకు నిధులు కొరత తీవ్రంగా వేధిస్తోంది. క్రీడల నిర్వహణకు అరకొర బడ్జెట్ కేటాయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాపోటీలు నిర్వహించాలంటే ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ఈ టోర్నీల నిర్వహణకు చాలామంది కార్యనిర్వాహక కార్యదర్శులు సైతం ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది.

పట్టించుకొనేదెవరు..?

జనవరి వచ్చినా జిల్లాస్థాయిలో ఎస్‌జీఎఫ్ క్రీడలకు సంబంధించి సెలక్షన్స్‌పై సందిగ్ధం వీడటం లేదు. సాధారణంగా ఆగస్టు నెలాఖరులోగా మండలస్థాయి, సెప్టెంబర్ మొదటి వారంలో జిల్లాస్థాయి సెలక్షన్స్ నిర్వహిస్తారు. కానీ, ఈసారి మండల, జోనల్, జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ సెలక్షన్స్‌కు సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి ప్రణాళికలు రూపొందించలేదని తెలుస్తోంది. దీంతో ఈ ఏడాది కూడా ఎస్‌జీఎఫ్ క్రీడలు జరుగుతాయో లేదో అన్న అయోమయం నెలకొంది.


జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ బాస్కెట్‌బాల్ టోర్నీ (ఫైల్)

వెంటనే ప్రారంభించాలి



కరోనా మహమ్మారి వల్ల రెండేళ్ల నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడలు జరగలేదు. అసోసియేషన్ క్రీడా టోర్నీలు జరుగుతున్నా ఎస్‌జీఎఫ్ ప్రారంభించలేదు. ఎస్‌జీఎఫ్ క్రీడలు జరగకపోవడం వల్ల ఇప్పటికే రెండేళ్లుగా విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారు. ఎస్‌జీఎఫ్ క్రీడా సర్టిఫికెట్‌లకు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. ఇప్పటికైనా ఈ విద్యాసంవత్సరం ముగిసేలోగా ఎస్‌జీఎఫ్ క్రీడలను ప్రారంభించాలి.

– జగన్‌మోహన్‌గౌడ్, పెటాటీఎస్ జిల్లా అధ్యక్షుడు, మహబూబ్‌నగర్

ఆదేశాలు వస్తేనే..



కళాశాల స్థాయిలో అండర్- 19 ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపికలు ఇంకా ప్రారంభం కాలేదు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తే అండర్- 19 ఎస్‌జీఎఫ్ క్రీడలను ప్రారంభిస్తాం. ఉమ్మడి జిల్లాలో ఎస్‌జీఎఫ్ క్రీడలు నిర్వహించడానికి సంసిద్ధంగా ఉన్నాం.

– పాపిరెడ్డి, అండర్-19 ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి, మహబూబ్‌నగర్

కార్యదర్శికి దరఖాస్తులు..

జిల్లాస్థాయిలో జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్)కు డీఈఓ అధ్యక్షుడిగా, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు కార్యనిర్వాహక కార్యదర్శిగా ఉంటారు. జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) కార్యదర్శి నియామకం కోసం ఇటీవలే డీఈఓ దరఖాస్తులను ఆహ్వానించారు. 2022- 23, 2023- 24 రెండేళ్లపాటు ఎస్‌జీఎఫ్ కార్యదర్శిని నియమించేందుకు అర్హతగల పీడీ, పీఈటీలు ఈనెల 10లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి నియామకంతో జిల్లా స్థాయిలో ఎస్‌జీఎఫ్ క్రీడలు త్వరగా ప్రారంభమవుతాయని క్రీడాకారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కాలుష్యకారక కంపెనీ మాకొద్దు


కలెక్టరేట్ ప్రధాన గేటు ఎదుట ధర్నా చేస్తున్న కాలుష్య పరిశ్రమ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

- కలెక్టరేట్ ఎదుట రైతుల నిరసన

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): కాలుష్య కారకమైన అమర్ రాజ్ బ్యాటరీ కంపెనీ మాకొద్దని ఆ కంపెనీ ప్రభావిత గ్రామాలకు చెందిన ప్రజలు, రైతులు డిమాండ్ చేశారు. ఐటీ కంపెనీకి సేకరించిన భూమిలో కాలుష్యకారకమైన కంపెనీలు పెట్టడాన్ని వ్యతిరేకిస్తున్న దివిటిపల్లి, ఎదిర, అప్పన్నపల్లి, సిద్దాయ్యపల్లి, అమిస్తాపూర్, భూత్పూర్, తాటిపర్తి గ్రామస్తులు కలిసి కాలుష్య పరిశ్రమ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం కొత్త కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పోరాట సమితి నాయకులు తిరుపతి రెడ్డి, చంద్రశేఖర్ మాట్లాడారు. కంపెనీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఐటీ కారిడార్ పేరుతో భూములు సేకరించిన ప్రభుత్వం అమర్‌జారకు సంబంధించిన కంపెనికి భూములు ఇస్తున్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ కంపెనీలు వస్తే చుట్టు పక్కల గ్రామాల్లో తాగేనీరు, పీల్చే గాలితో పాటు చుట్టుపక్కల వాతావరణం కాలుష్యం బారిన పడుతుందన్నారు. 40 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తున్న కరివెన రిజర్వాయర్ కూడా కాలుష్యం బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ప్రజల అభిప్రాయాన్ని పట్టించుకోకుండా మొండిగా కంపెనీని తీసుకొస్తే.. ప్రాణ త్యాగానికైనా సిద్ధమని హెచ్చరించారు. మా జీవితాలు నాశనం అయ్యే కంపనీలు కాకుండా, మా బతుకులు బాగుపడే కంపనీలు తీసుకొస్తే బాగుంటుందని అన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ వెంకట్రావ్‌కు అందజేశారు.

ఇథనాల్ కంపెనీని రద్దు చేయాలి

నారాయణపేట టౌన్: మరికల్ మండల పరిధిలోని చిత్తనూర్‌లో ఇథనాల్ కంపెనీని ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ.. చిత్తనూర్, ఎక్లాస్‌పూర్, జిన్నారం తదితర గ్రామాలకు చెందిన రైతులు, రైతు కూలీలు, ఆయా గ్రామాల ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట సమితి నాయకులు ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ రాంచందర్ నాయక్‌తో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. రైతులు ఇథనాల్ కంపెనీ ద్వారా తమ వ్యవసాయ రంగానికి సాగు నీరు కల్గించే నష్టాలను వివరించారు. కంపెనీ తరఫున పాల్గొన్న ప్రతినిధులు ఇథనాల్ కంపెనీ ఏర్పాటుకు అన్ని విధాలుగా అనుమతులు ఉన్నాయని, మేము చాలా మేలు చేస్తున్నామనే తరహాలో ఆర్డీఓతో వివరించారు. ఆర్డీఓ రైతులకు సంబంధించిన అభిప్రాయాలు, కంపెనీకి సంబంధించిన పూర్తి వివరాలను పరిశీలించి చర్చించేందుకు అవకాశం ఇచ్చారు. అంతకు ముందు ఇథనాల్ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు ఆర్డీఓకు వినతి అందజేశారు.


నారాయణపేట ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

భూ పంచాయితీతో ఆగిన అంత్యక్రియలు


బోయ చెన్నమ్మ (ఫైల్)

భూత్పూర్: భూ పంచాయతీతో ఓ మహిళ అంత్యక్రియలు రెండు రోజులుగా చేయకుండా నిలిపివేశారు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కప్పెట చెందిన బోయ నారాయణ, బోయ రాములు ఇద్దరు అన్నదమ్ముళ్లు. వీరిద్దరు మృతి చెందగా, నారాయణ భార్యసైతం మృతి చెందింది. శనివారం సాయంత్రం రాములు భార్య చెన్నమ్మ (60) అనారోగ్యంతో మృతిచెందింది. వీరు ఉమ్మడిగా ఉన్న సమయంలో 1965లో గ్రామంలోని సర్వేనంబరు 176, 177లో 12ఎకరాల పొలం కొనుగోలు చేశారు. అప్పటి నుంచి ఇద్దరు అన్నదమ్ముళ్లు 6 ఎకరాల చొప్పున సమ భాగాలు చేసుకొని వ్యవసాయం చేస్తున్నారు. 2008 సంవత్సరం నుంచి బోయ రాములు తన అన్న బోయ నారాయణను వ్యవసాయ పొలం సమ భాగాలుగా తహసీల్దార్ కార్యాలయంలో రికార్డుల్లో ఎక్కించుకుందామని తరుచూ నారాయణ ఇంటి వద్దకు వెళ్లి అడిగేవారు. ఇదే అదునుగా చేసుకుని నారాయణ తమ్ముడుకి చెప్పకుండానే తన పేరు మీద తహసీల్దార్ కార్యాలయంలో పట్టా చేసుకున్నాడు. భూమి నారాయణ మృతి చెందిన తర్వాత భార్యపై పట్టా విరాసత్ చేశారు. నారాయణ భార్య సైతంమృతి చెందడంతో వారసుడిగా కుమారులు నర్సింహులు, శేఖర్, కృష్ణయ్య పేరు మీద తహసీల్దార్ కార్యాలయంలో విరాసత్ చేసుకున్నాడు. రాములు సైతం కొన్నేళ్ల క్రితమే మృతి చెందడంతో, భార్య చెన్నమ్మ శనివారం మృతి చెందగా కుమారుడు నిరంజన్, కూతురు అంజమ్మ తాము చేసుకుంటున్న భూమి అక్రమంగా మా పెద్దనాన్న బోయ నారాయణ కుమారుడు బోయ నర్సింహులు తహసీల్దార్ కార్యాలయంలో పట్టా చేసుకొన్నాడని, తమ భూమిని తమపేర్లపై చేసేదాకా మా అమ్మ శవాన్ని అంత్యక్రియలు చేసేది లేదని పట్టుబట్టారు. దీంతో గ్రామ పెద్దలు బోయ నర్సింహులుకు నచ్చ చెప్పినా వినకపోవడంతో సోమవారం భూత్పూర్ పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ చెన్న కిష్టన్నకు వినతిపత్రం అందజేశారు. అనంతరం గ్రామ పెద్దలు బోయ చెన్నమ్మ కుటుంబ సభ్యులకు నచ్చచెప్పడంతో సోమవారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కుటుంబ సభ్యులు

కూతుర్ని తీసుకెళ్లడానికి వచ్చి.. అనంతలోకాలకు

దేవరకద్ర రూరల్: సంక్రాంతి పండుగ కోసం కూతురిని పుట్టింటికి తీసుకెల్లడానికి వచ్చిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. సోమవారం మండలంలో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ భగవంత్‌రెడ్డి కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలోని దొడ్డలోనిపల్లికి చెందిన పెద్ద తిరుపతయ్య(40) తన కూతురిని దేవరకద్ర మండలంలోని అజిలాపూర్‌కు చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం జరిపించారు. ఈ క్రమంలో సంక్రాంతి పండుగకు కూతురిని ఇంటికి తీసుకెళ్లేందుకు తిరుపతయ్య సోమవారం దేవరకద్రకు వచ్చాడు. అయితే అదే దారిలో ఇతరుల అంత్యక్రియలకు వెళ్తున్న ఓ ట్రాక్టర్‌పై ఎక్కి ముందుభాగంలో కూర్చున్నాడు. అజిలాపూర్ గ్రామ సమీపంలోకి రాగానే అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో ట్రాక్టర్‌పై నుంచి కిందపడగా ట్రాక్టర్ ట్రాలీ టైరు తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

వంగూరు: మండలంలోని కోనేటిపూర్ గ్రామ శివారులో శ్రీశైలం - హైదరాబాద్ ప్రధాన రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందింది. వంగూరు మండలం సర్వారెడ్డిపల్లి తండాకు చెందిన లక్ష్మణ్ తన కుటుంబ సభ్యులతో ఆటోలో డిండి వైపు వెళ్తున్నాడు. వెనకాల నుంచి వచ్చిన కారు అతి వేగంతో ఆటోను ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న లాలి(48) అక్కడికక్కడే మృతిచెందింది. ప్రమాదంలో మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కురుమూర్తి పేర్కొన్నారు.

అగ్నిప్రమాదంలో గుడిసె దగ్ధం


ప్రమాదంలో కాలిపోయిన వస్తు సామగ్రి

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధమైన సంఘటన సోమవారం పట్టణంలో చోటు చేసుకుంది. నల్లకుంటకాలనీలో నివాసం ఉంటున్న ఎల్లయ్య, భాగ్యలక్ష్మి పూరి గుడిసె వేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఉదయం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతం సంబవించడంతో పెద్ద ఎత్తున్న మంటలు వ్యాపించాయి. స్థానికులు మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నం చేయగా ఎలాంటి ఫలితం లేకపోయింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాదంలో నిత్యవసర సరుకులు, దుస్తులు, నగదు, బంగారు, వెండి అగ్నికి ఆహుతయ్యాయి. రూ.2లక్షల ఆస్తినష్టం చోటు చేసుకుందని బాధితులు తెలిపారు.

ఆపరేషన్‌స్మైల్ బృందం దాడులు

నారాయణపేట రూరల్: ఆపరేషన్ స్మైల్ బృందాలు సోమవారం ధన్వాడ, మరికల్ మండలాల్లో దాడులు నిర్వహించారు. 8మంది బాలకార్మికులను గుర్తించారు. వారిని నారాయణపేట సీడబ్ల్యూసీ కార్యాలయంలో అప్పగించారు. ఎక్కడైనా బాలకార్మికులు కనిపిస్తే 100కు కాల్ చేసి తెలియచేయాలన్నారు.



గుడిసె దగ్ధం

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని నార్లపూర్‌కి చెందిన జింకల మలేష్‌కు చెందిన నివాసం ఉంటున్న గుడిసె షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదవశాత్తు దగ్ధమైంది. వెంటనే ఫైర్ ఇంజిన్ వచ్చి మంటలను ఆర్పింది. గుడిసెలోని వస్తువులు, దుస్తులు, తిండిగింజలు, మరియు వంట సామగ్రి దగ్ధమైంది. గుడిసెలో రూ.లక్ష నగదు ఉందని, అదికూడా కాలిపోయినట్లు యాజమాని మల్లేష్ తెలిపారు. గుడిసెలోని అన్ని వస్తువులు కాలిపోయినట్లు అగ్నిమాపక అధికారి నరసింహారావు తెలియజేశారు. రూ.4లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని వివరించారు.

బూడిద తెగులు- నివారణ

అలంపూర్: మిరపపంట సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏడీఏ సక్రియనాయక్ రైతులకు సూచించారు. ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితుల్లో బూడిద తెగులు, లద్దె పురుగు ఆశిస్తుందని సూచించారు. సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో రైతులు నష్టపోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. బూడిద తెగులు, లద్దె పురుగు నివారణకు పలు సూచనలు, సలహాలను ఆయన వివరించారు.

బూడిద తెగులు..

ఈ తెగులు రావడానికి కారణం రాత్రివేళ వాతావరణం చల్లగా ఉండటం, పగటి పూట ఎండ ఉండటం వలన బూడిద తెగులు వ్యాపిస్తుంది. ఈ తెగులు వలన ఆకులమీద తెల్లని మచ్చలు ఏర్పడతాయి. తర్వాత ఈ మచ్చల నుంచి శిలీంధ్ర బీజాలు ఉత్పత్తి అయి ఆకులమీద తెల్లటి పొడగా ఏర్పడతాయి. తెగులు ఉధృతంగా ఉన్నప్పుడు పొడలు ఆకులమీద, పిందెల మీద, కాయలపై వ్యాప్తి చెందుతాయి. దీని వల్ల ఆకులు ఎండి పండుబారుతాయి. ఆకుల మీద తెల్లటి పొడ ఏర్పడటం వలన కిరణజన్య సంయోగ క్రియ తగ్గుతుంది. తగినంత ఆహార పదార్థాలు తయారవక కాయలు నాణ్యతగా ఉండవు.

నివారణ:

ఈ తెగులు నివారణకు నీటిలో కరిగే గంధకం 200 గ్రాములు, డైనోకాప్ 200 మి.లీ, బెలటాన్ 200 మి.లీ, ట్రైడిమార్ఫ్ 200 మి.లీ, అజాక్సి స్ట్రోబీన్ 200 మి.లీలను 200 లీటర్లలో కలిపి ఆకులు బాగా తడిచేటట్లు పిచికారీ చేసుకోవాలి.

కాయతొలుచే పురుగు:

ప్రస్తుతం కాయలకు కాయతొలిచే పురుగు ఆశిస్తుంది. ఈ పురుగు కాయలోపలి భాగానికి ప్రవేశించి లోపల ఉన్న పదార్థాన్ని తినడం వలన కాయ నాణ్యత పడిపోతుంది.

నివారణ:

ఈ పురుగు నివారణకు అసిఫేట్ 1.5 గ్రాములు, నువలురాన్ 1.0 మి.లీ, రెనాక్సి ఫైర్ 0.3 మి.లీ , ఫ్లూబెండమయిడ్ 0.3 గ్రాములు, క్లోరాంత్రినిపోల్ 0.3 మి.లీ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.


కాయతొలుచు పురుగు ఆశించిన కాయ


బూడిద తెగులు ఆశించిన ఆకులు

బొగ్గు దిగుమతి చేసుకోవాల్సిందే !

- దేశీయ బొగ్గుకు 6శాతం విదేశీ బొగ్గు కలపాలి
- లేకుంటే దేశీయ బొగ్గు సరఫరాకు కోత పెడతాం
- రాష్ట్రాల జెన్‌కోలకు కేంద్ర విద్యుత్ శాఖ ఆదేశం
- తక్షణమే దిగుమతులకు ఆర్డర్ చేయాలని సూచన

సాక్షి, హైదరాబాద్: విదేశాల నుంచి తప్పనిసరిగా బొగ్గు దిగుమతులు చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం మళ్లీ ఆదేశించింది. ఇటీవల కాలంలో దేశంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగిపోవడంతో దేశంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలు బొగ్గు కొరతను ఎదుర్కొనే అవకాశముందని పేర్కొంది. దేశీయ బొగ్గు సరఫరా పెరిగినప్పటికీ విపరీతమవుతున్న విద్యుత్ డిమాండ్‌ను తీర్చడానికి సరిపోదని స్పష్టం చేసింది. ప్రతి రోజూ లక్ష టన్నుల నుంచి 3లక్షల టన్నుల బొగ్గు కొరత ఉండవచ్చని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మిగిలి ఉన్న కాలం(మార్చి 2023)తో పాటు వచ్చే ఆర్థిక సంవత్సరంలోని తొలి అర్ధ వార్షికం(2023 మార్చి–సెప్టెంబర్) వరకు 6శాతం దిగుమతి చేసుకున్న బొగ్గును దేశీయ బొగ్గుతో కలిపి(బ్లెండ్ చేయడం అంటారు) థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో వినియోగించాలని ఆదేశించింది. ఈ ఆదేశాలను అమలు చేయని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు దేశీయ బొగ్గు సరఫరాను కట్టడి చేస్తామని హెచ్చరించింది.

అన్ని రాష్ట్రాలకు లేఖ రాసిన కేంద్రం

విదేశీ బొగ్గు దిగుమతుల్లో ఎంత శాతం లోటు ఉంటే అంత శాతం వరకు దేశీయ బొగ్గు సరఫరాను సంబంధిత థర్మల్ విద్యుత్ కేంద్రాలకు కోత పెడతామని పేర్కొంది. ఈ మేరకు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ సోమవారం అన్ని రాష్ట్రాలకు లేఖ రాసింది. ఈ ఆదేశాల అమలులో భాగంగా విదేశీ బొగ్గు దిగుమతుల కోసం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. పోటీ బిడ్డింగ్ ద్వారా పారదర్శకమైన పద్ధతిలో బొగ్గు దిగుమతులకు తక్షణమే రాష్ట్రాల జెన్‌కోలతో పాటు ఇండిపెండెంట్ విద్యుత్ ఉత్పత్తిదారులు టెండర్లను ఆహ్వానించాలని కోరింది.

అలా ఆర్డర్ చేసే ప్రసక్తే లేదు

గతేడాది సైతం విదేశీ బొగ్గు దిగుమతులను అప్పట్లో కేంద్రం తప్పనిసరి చేయగా, తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకించింది. రాష్ట్రంలోని విద్యుత్ ప్లాంట్లు దేశీయ బొగ్గు ఆధారంగా పనిచేస్తాయని, విదేశీ బొగ్గును వినియోగిస్తే సాంకేతిక సమస్యలు వస్తాయని ఆందోళన వ్యక్తం చేసింది. కేంద్రం ఎంత ఒత్తిడి చేసినా రాష్ట్ర ప్రభుత్వం విదేశీ బొగ్గుకు ఆర్డర్ ఇవ్వలేదు. సింగరేణి బొగ్గు గనుల సంస్థ రాష్ట్రంలో ఉండడంతో రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు ఎలాంటి బొగ్గు కొరత ఉండదని, ఖరీదైన బొగ్గు దిగుమతులకు ఆర్డర్ చేసే ప్రసక్తే లేదని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.



శిక్షణలో భాగంగా రన్నింగ్ చేస్తున్న అగ్నివీర్‌లు

'అగ్ని' బరాటాలు!

మొదటి బ్యాచ్ అగ్నివీర్‌ల శిక్షణ ప్రారంభం

- రెండు భాగాలుగా 31 వారాల పాటు తర్ఫీదు
- అత్యాధునిక సిమ్యులేటర్లు సైతం వినియోగం



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన, గతేడాది అత్యంత వివాదాస్పదంగా మారిన అగ్నిపథ్ పథకం అమలులోకి వచ్చింది. మొదటి బ్యాచ్‌లో మొత్తం 40 వేల మంది అగ్నివీర్‌లుగా ఎంపిక కాగా.. వీరిలో 5,600 మందికి నగరంలోని గోల్కొండలోని ఆర్టిలరీ సెంటర్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ నెల 2 నుంచి మొదటి బ్యాచ్ మొదలైంది. ఈ నేపథ్యంలో ట్రైనింగ్‌లోని విశేషాలను వివరించేందుకు ఆర్మీ అధికారులు సోమవారం మీడియా టూర్ నిర్వహించారు. దేశంలోనే అతి పెద్దదైన గోల్కొండ ఆర్టిలరీ సెంటర్‌లో జరుగుతున్న అగ్నివీర్‌ల శిక్షణ తీరుతెన్నులు ఇలా..

స్క్వాడ్స్‌గా విభజించి..

ఇప్పటికే 2,265 మంది అగ్నివీర్‌లకు శిక్షణ మొదలైంది. వీళ్లని రీజియన్, బ్యాటరీ, ట్రూప్, స్క్వాడ్స్‌గా విభజించారు. ఒక్కో స్క్వాడ్‌లో గరిష్టంగా 32 మంది అభ్యర్థులు ఉంటారు. వీరికి ఫిజికల్, వెపన్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ సహా అనేక అంశాల్లో శిక్షణ ఇస్తారు. ఫిజికల్ ట్రైనింగ్ కోసం ఆర్టిలరీ సెంటర్‌లో మొత్తం 30 గ్రౌండ్స్ ఉన్నట్లు చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కల్నల్ షలీన్ సింగ్ తెలిపారు. ఇందులో స్క్వాడ్ల వారీగా రోప్, బార్స్, బీమ్స్ తదితరాలతో శిక్షణ ఇచ్చి అప్పర్ బాడీ పటిష్టమయ్యేలా చేస్తారు.

ముందు బేసిక్ ఆపై అడ్వాన్స్‌డ్

మొత్తం 31 వారాల పాటు సాగే శిక్షణను బేసిక్, అడ్వాన్స్‌గా విభజించారు. బేసిక్‌లో ప్రతి అంశానికీ సంబంధించి ప్రాథమిక అంశాలు బోధిస్తారు. డ్రిల్, వెపన్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, రాజ్యాంగం, మానవహక్కులు తదితరాలను అవగాహన కల్పిస్తారు. పది వారాల పాటు సాగే ఈ శిక్షణలో అభ్యర్థుల ప్రతిభ, ఆసక్తి బట్టి ఆయా రంగాల్లో అడ్వాన్స్‌డ్ శిక్షణ ఇవ్వనున్నారు. ఇందులో టెక్నికల్ అసిస్టెన్స్, గన్నర్స్, డ్రైవర్స్ ఇలా వివిధ విభాగాలు ఉంటాయి. ఫిజికల్ ట్రైనింగ్ మాత్రం ఆద్యంతం కొనసాగుతుంది. ప్రతి అగ్నివీర్‌కు ఆంగ్ల, హిందీ భాషలతో పాటు మాట, నడక, నడత, వేషధారణ తదితరాలను బోధిస్తున్నారు. ఉదయం 4 గంటలకు నిద్రలేచే అగ్నివీర్... 6 గంటలకు గ్రౌండ్‌కు వస్తారు. 7.30 గంటల వరకు ఫిజికల్ ట్రైనింగ్, అప్పటి నుంచి 8.45 గంటల వరకు డ్రిల్ లేదా వెపన్స్ ట్రైనింగ్, 8.45 నుంచి 1.30 వరకు థియరీ క్లాసులు ఉంటాయి. రెండో విడత మధ్యాహ్నం 4 గంటలకు గేమ్స్ మొదలవుతాయి. 5.20 తర్వాత అభ్యర్థులకు ఫ్రీ టైమ్ కాగా... 9 గంటలకు నిద్రకు ఉపక్రమించాల్సిందే.

అత్యాధునిక సిమ్యులేటర్స్ వినియోగం..

బేసిక్ ట్రైనింగ్‌లో వెపన్స్ శిక్షణను ఇబ్రహీంబాగ్ లాంగ్ రేంజ్‌లో ఇన్సాస్ రైఫిల్‌తో ఇస్తారు. అడ్వాన్స్‌డ్ శిక్షణలో మాత్రం ఆర్టిలరీ గన్స్‌పై ఉంటుంది. ఆర్టిలరీ సెంటర్‌లో అగ్నివీర్‌ల శిక్షణ కోసం అత్యాధునిక సిమ్యులేటర్స్ వాడుతున్నారు. 'లివింగ్ ఎ లైఫ్ లెస్ ఆర్డినరీ ఐయామ్ ఎ అగ్నివీర్' అనేది అగ్నివీర్ నినాదం కాగా.. 'వన్ షాట్ ఇన్ ఎనిమీ' అన్నది వెపన్స్ ట్రైనింగ్‌కు సంబంధించింది. యుద్ధంలోనే కాదు శిక్షణలోనూ తూటాలు నష్టపోకుండా తొలి దశలో సిమ్యులేటర్‌పై శిక్షణ ఇస్తున్నారు. దీంతో పాటు రేడియో ద్వారా సమాచార మార్పిడి, యుద్ధ, అత్యవసర సమయాల్లో మెడికల్ కేర్, రూమ్ ఇంటర్వెన్షన్, శాండ్ మోడల్.. ఇలా అనేక సిమ్యులేటర్లతో అగ్నివీర్‌లు శిక్షణ పొందుతున్నారు. గోల్కొండ ఆర్టిలరీ సెంటర్‌లో శిక్షణ పొందున్న వారికి అగ్నివీర్ అనేది ఇంటి పేరుగా మారిపోతోంది. ప్రతి ఒక్కరూ తమను పరిచయం చేసుకునేప్పుడు 'అగ్నివీర్ రాకేష్ కుమార్', 'అగ్నివీర్ అజాజ్ అహ్మద్', 'అగ్నివీర్ హమన్‌సింగ్' అని చెబుతున్నారు.

అగ్నివీర్‌లకు శిక్షణ ఇక్కడే

- 15 శాతం మందికి గోల్కొండ ఆర్టిలరీలోనే..
- బ్రిగేడియర్ రాజీవ్ చౌహాన్



అగ్నిపథ్‌లో భాగంగా తొలి దశలో 15 శాతం మందికి గోల్కొండలోని ఆర్టిలరీ సెంటర్‌లోనే శిక్షణ ఇస్తున్నట్లు బ్రిగేడియర్ రాజీవ్ చౌహాన్ తెలిపారు. మొదటి బ్యాచ్ అగ్నివీర్‌లకు శిక్షణ మొదలైన నేపథ్యంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. 1,900 ఎకరాల్లో విస్తరించి ఉన్న గోల్కొండ ఆర్టిలరీ సెంటర్ దేశంలోనే అతి పెద్దదని, ఇక్కడ అగ్నివీర్‌లకు అత్యుత్తమ శిక్షణ లభిస్తుందని పేర్కొన్నారు. మొదటి బ్యాచ్‌లో 2,300 మందికి శిక్షణ ఇవ్వాల్సి ఉండగా ఇప్పటికే 2,265 మందికి ప్రారంభమైందని వివరించారు. రెండో దశలో మరో 3,300 మందికి మార్చి ఒకటో తేదీ నుంచి ప్రారంభంకానుందని రాజీవ్ చౌహాన్ వెల్లడించారు. 31 వారాల పాటు ఉండే అగ్నివీర్ శిక్షణతో 10 వారాల పాటు బేసిక్ ట్రైనింగ్, ఆపై 21 వారాలు అడ్వాన్స్‌డ్ శిక్షణ ఉంటాయని తెలిపారు. శిక్షణతో పాటు మూడున్నరేళ్ల సర్వీసులో ఆయా అగ్నివీర్‌లు చూపించే ప్రతిభ ఆధారంగా 25 శాతం మంది పూర్తి స్థాయిలో సైన్యంలో కొనసాగుతారని వివరించారు. నాలుగేళ్ల సైన్యంలో ఉండి బయటకు వచ్చే వాళ్లు సైతం మరింత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తారని ఆయన స్పష్టం చేశారు.

బోర్డు తిప్పేసిన గల్ఫ్ ఏజెంట్

- కువైట్ వీసాల పేరిట రూ. కోట్లు కుచ్చుటోపీ
- సుమారు 600 మంది నిరుద్యోగుల వద్ద డబ్బులు వసూలు
- రాత్రికి రాత్రే సామగ్రి తరలింపు
- ఫోన్ స్విచ్చాఫ్
- బాధితుల రాస్తారోకో



కువైట్ పంపిస్తానని నిరుద్యోగులను మోసం చేసిన షేక్ బషీర్

డిచ్‌పల్లి(నిజామాబాద్ రూరల్): నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఆర్‌కే టూర్స్ అండ్ ట్రావెల్స్ నిర్వాహకుడు షేక్ బషీర్ కువైట్ వీసాల పేరిట సుమారు 600 మందికి పైగా నిరుద్యోగులను నిండా ముంచాడు. బాధితుల తెలిపిన వివరాల ప్రకారం.. ఒక్కొక్కరి వద్ద రూ.20 వేల నుంచి రూ.60 వేల వరకు డబ్బులు వసూలు చేశాడు. మెడికల్ టెస్ట్‌ల పేరిట మరో రూ.5,600 చొప్పున వసూలు చేశాడు. రెండు నెలలుగా వేచి చూసిన బాధితులు వీసాల కోసం ఒత్తిడి చేయగా రాత్రికి రాత్రే బోర్డు తిప్పేశాడు. మొబైల్ ఫోన్‌ను స్విచ్చాఫ్ చేశాడు. సోమవారం ఉదయం వీసాలు తీసుకుందామని వచ్చిన బాధితులు ట్రావెల్స్ మూసి ఉండటం, బోర్డు కూడా లేకపోవడంతో సుమారు 200 మంది డిచ్‌పల్లికి చేరుకుని ముందుగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత ట్రావెల్స్‌లో పని చేసిన రాంపూర్ గ్రామానికి చెందిన లింబాద్రిని పట్టుకుని షేక్ బషీర్ అడ్రస్, వివరాలు చెప్పాలని నిలదీశారు. అయితే బషీర్ వద్ద తాను కేవలం జీతానికి పని చేశానని అతడు మోసం చేసి పారిపోతాడని తనకు తెలియదని తననేం చేయవద్దని మొరపెట్టుకున్నాడు. అక్కడి నుంచి బాధితులు డిచ్‌పల్లి–నిజామాబాద్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీంతో రోడ్డుపై భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. మెడికల్ టెస్ట్‌ల పేరిట తమవద్ద రూ.5,600 చొప్పున వసూలు చేసిన జిల్లా కేంద్రంలోని విజయ శ్రీ డయాగ్నొస్టిక్ సెంటర్ పై కూడా చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేశారు. డిచ్‌పల్లి ఎస్సైకై గణేష్ తన సిబ్బందితో అక్కడికి చేరుకుని న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో బాధితులు రాస్తారోకో విరమించారు. ఏజెంట్ బషీర్ ఎక్కడి వాడనే విషయంపై స్పష్టత రావడం లేదని పోలీసులు తెలిపారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్ అడ్రస్‌తో ఇంటి ఓనర్‌తో రెంటల్ అగ్రిమెంట్ చేయించాడు. అయితే బషీర్ తనకు కూడా రెండు నెలల అద్దె ఎగ్గొట్టినట్లు సదరు ఇంటి యజమాని చెబుతున్నారు. కాగా బషీర్, ఎడపల్లి మండలం ఎంఎస్‌ఫారం గ్రామానికి చెందిన వాడని కొందరు బాధితులు తెలిపారు.



డిచ్‌పల్లి–నిజామాబాద్ రహదారిపై ఆర్‌కే టూర్స్ అండ్ ట్రావెల్స్ ఎదుట రాస్తారోకో చేస్తున్న బాధితులు

రూ. 20 వేలు ఫోన్ పే చేశాను



మాది డిచ్‌పల్లి మండలం కమలాపూర్ గ్రామం. బషీర్ నాకు కువైట్‌లో అమెరికన్ ఫుడ్ కంపెనీలో వీసా ఇప్పిస్తానని చెప్పాడు. అడ్వాన్స్‌గా రూ.20 వేలు ఫోన్ పే ద్వారా చెల్లించాను. విజయశ్రీ డయాగ్నొస్టిక్ సెంటర్‌లో మెడికల్ టెస్ట్ పేరిట రూ. 5,600 చెల్లించాను. సోమవారం వీసా తెచ్చిస్తానని పరారయ్యాడు.

– అబ్దుల్ కరీం, కమలాపూర్

మోసపోయాం



నాతో పాటు కోరుట్ల కథలాపూర్ గ్రామానికి చెందిన 8 మంది రూ. 20 వేలు చొప్పున ఇచ్చాము. సోమవారం కువైట్ కంపెనీ వీసా ఇస్తానని చెప్పాడు. ఇక్కడికి వచ్చి చూసేసరికి అసలు ట్రావెల్ బోర్డు కూడా కన్పించలేదు. బతుకుదెరువు కోసం గల్ఫ్‌కు వెళదామనుకుని ఏజెంట్ చేతిలో ఇలా మోసపోయాం.

– తిరుపతి, కథలాపూర్ (కోరుట్ల)


పీజేపీ అధికారులకు నోటీసులు

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు అధికారులకు లోకాయుక్తా నుంచి నోటీసులు జారీ అయ్యాయి. మంగళవారం సంబంధిత శాఖ అధికారులు హాజరుకావాలని నోటీసులు జారీ అయినట్లు ఫిర్యాదుదారుడు డ్యాం హన్మంతు సోమవారం నోటీసు కాపీలను స్థానిక విలేకరులకు అందజేశారు. జూరాల ప్రాజెక్టు దిగువన ఉన్న రేవులపల్లి క్యాంపులో పీజేపీ క్వార్టర్స్‌లో 10 భవనాలను కొందరు అద్దెకు ఇస్తూ నెలనెలా రూ.25 వేల ప్రభుత్వ సొమ్మును జేబులో వేసుకుంటున్నారని, అలాగే రేవులపల్లి డివిజన్ పరిధిలో ఎలాంటి పనులు చేయకుండా అక్కడక్కడ లైనింగ్ చేపట్టి రూ.70 లక్షల సొమ్ము కాజేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నిండుకుండలా రామన్‌పాడు జలాశయం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో సోమవారం పూర్తిస్థాయి నీటి మట్టం 1,021 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 200, సమాంతర కాల్వ ద్వారా 850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. దీంతో ప్రాజెక్టులోని ఎన్టీఆర్ కాల్వ ద్వారా 120, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

తుమ్మిళ్ల లిఫ్టు నుంచి నీటి విడుదల



రాజోళి: తుమ్మిళ్ల లిఫ్టు నుంచి ఆర్డీఎస్ కెనాల్‌కు సోమవారం నీటిని విడుదల చేసినట్లు ఏఈఈ వరుణ్ కుమార్ తెలిపారు. నదిలో నుంచి మోటార్లకు అందించే నీటి సామర్థ్యం కారణంగా మూడు రోజులుగా కెనాల్‌లో నీరు ప్రవహించలేదని చెప్పారు. కాగా కెనాల్ కింద ఆయకట్టు రైతుల అవసరాల కోసం, నదిలో ఉన్న నీటి లభ్యతను మోటార్ల ద్వారా ఆయకట్టుకు అందించినట్లు తెలిపారు. తుమ్మిళ్ల ఎత్తిపోతల నుంచి ఆర్డీఎస్ డీ–23కి నీటిని విడుదల చేసి, అక్కడి నుంచి ఆయకట్టుకు అందనున్నట్లు ఆయన తెలిపారు.

నియామకం ఎప్పుడో..?

- వెలువడని అంగన్‌వాడీ టీచర్ల తుది అభ్యర్థుల జాబితా
- స్థానికంగా డిమాండ్ నేపథ్యంలో తీవ్ర ఒత్తిళ్లు
- ఉద్యోగాల కోసం అభ్యర్థులకు తప్పని ఎదురుచూపులు



మహబూబ్‌నగర్ రూరల్ మండలం ధర్మాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు (ఫైల్)

మహబూబ్‌నగర్ రూరల్: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీలు భర్తీ చేసే ప్రక్రియ నత్తనడకన కొనసాగుతోంది. ఇంటర్వ్యూల నుంచి ధ్రువీకరణ పత్రాల పరిశీలన వరకు మొత్తం ప్రక్రియ పూర్తిచేసినా.. ఇంకా ఎంపికైన అభ్యర్థుల తుది జాబితా ప్రకటించడంలో తీవ్ర జాప్యం నెలకొంటుంది. దీనిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంగన్‌వాడీ టీచర్లు, ఆయా ఉద్యోగాలకు స్థానికంగా డిమాండ్ ఉంది. ఉండే గ్రామం, పట్టణంలో పనిచేయాల్సి ఉండటంతో పలుకుబడి ఉన్నవారు పైస్థాయిలో తీవ్ర ఒత్తిళ్లు తీసుకువస్తున్నట్లు తెలిసింది. జిల్లాలోని మహబూబ్‌నగర్ అర్బన్, మహబూబ్‌నగర్ రూరల్, జడ్చర్ల, దేవరకద్ర ప్రాజెక్టుల పరిధిలో 1,185 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. ఇందులో 1,081 మెయిన్, 104 మినీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల పరిధిలో 6,741 మంది గర్భిణులు, 7,792 మంది బాలింతలు లబ్ధిపొందుతున్నారు. అంతేకాకుండా ఏడు నెలల నుంచి మూడేళ్ల వరకు 25,131 మంది చిన్నారులు ఉన్నారు. కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందేలా చూడాల్సిన బాధ్యత అంగన్‌వాడీ టీచర్లదే. వీరిలో ఎవరికి పోషకాహారం లోపం ఉన్నా.. వారిపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తూ ఆరోగ్య లక్ష్మి పథకం పకడ్బందీగా అమలయ్యేలా వారు పర్యవేక్షించాల్సి ఉంటుంది. కేంద్రాలకు వచ్చే చిన్నారులకు అంగన్‌వాడీ టీచర్లు పూర్వ ప్రాథమిక విద్య బోధిస్తుండగా.. ఆయాలు గర్భిణులు, బాలింతలకు ఇచ్చే ఆహారం అందిస్తుంటారు. కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలంతల హాజరును టీచర్లు నమోదు చేసుకోవడంతోపాటు చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య వారే బోధించాల్సి ఉంటుంది. ప్రభుత్వం సరఫరా చేసే నిత్యావసర సరుకుల వివరాలు రికార్డుల్లో టీచర్లే నమోదు చేయాలి. కేంద్రాల నిర్వహణ విధులతోపాటు ప్రభుత్వం చేపట్టే ఇతర కార్యక్రమాల్లోనూ అంగన్‌వాడీ టీచర్లు భాగస్వాములు కావాల్సి ఉంటుంది. కాగా టీచర్లు, ఆయాలు లేని చోట్ల అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ చాలా ఇబ్బందికరంగా మారింది. ఈ కేంద్రాల్లోని ఖాళీలను భర్తీ చేసేందుకు చేపట్టిన నియామక ప్రక్రియ ఇంకా పూర్తి కాకపోవడంతో టీచర్లు, ఆయాలు లేని కేంద్రాల్లో సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారు.

జాప్యంపై అనుమానాలు

జిల్లాలో మహబూబ్‌నగర్ అర్బన్, మహబూబ్‌నగర్ రూరల్, జడ్చర్ల, దేవరకద్ర ప్రాజెక్టుల పరిధిలో 1,185 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. రెండేళ్ల కిందట ఖాళీగా ఉన్న 29 మెయిన్ కేంద్రాల టీచర్లు, 12 మినీ కేంద్రాల టీచర్లు, 123 మంది ఆయా పోస్టులు భర్తీ చేసేందుకు గత 2021 సెప్టెంబర్‌లో నియామక ప్రక్రియ చేపట్టారు. ప్రాథమికంగా ఎంపిక చేసిన అభ్యర్థులకు సంబంధించిన ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ కూడా పూర్తి చేశారు. అయితే ఈ ప్రక్రియ పూర్తయి నెలలు గడిచిపోతున్నా ఎంపికైన అభ్యర్థుల తుది జాబితా ఇంతవరకు ప్రకటించలేదు. ఎంపిక చేసిన అభ్యర్థుల తుది జాబితా వెల్లడించాలని చాలారోజులుగా ఆశావహులు అభ్యర్థిస్తున్నారు.

అంతా ఆన్‌లైన్‌లోనే..



అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టుల భర్తీ ప్రక్రియను అంతా ఆన్‌లైన్‌లోనే చేపట్టాం కదా. ఒక చిన్న క్లారిటీ కోసం తుది జాబితాను ప్రకటించలేదు. ఒకటి, రెండు రోజుల్లో మెరిట్ జాబితాను మరోసారి పరిశీలించి మెరిట్‌లో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను విడుదల చేస్తాం.

– జరీనాబేగం, డీడబ్ల్యూఓ

మెరిట్‌లో నిలిచిన వారికే..

అంగన్‌వాడీ టీచర్లు, ఆయా ఉద్యోగాలకు స్థానికంగా డిమాండ్ ఉంది. అంగన్‌వాడీ టీచర్ ఉద్యోగానికి పదో తరగతి విద్యార్హత ఉండగా.. ఎక్కువ చదువుకున్న వారు కూడా దరఖాస్తు చేస్తున్నారు. సాధారణంగా మెరిట్‌లో నిలిచిన అభ్యర్థులకే ఉద్యోగాలు దక్కాలి. అయితే కొందరు ఎలాగైనా అంగన్‌వాడీ టీచర్ ఉద్యోగం దక్కించుకునేందుకు అధికార పార్టీ ముఖ్య నేతలతో సిఫారసు చేయించుకునే ప్రయత్నం చేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఎంపికైన అభ్యర్థుల జాబితా వెంటనే ప్రకటించి నియామక ప్రక్రియ పారదర్శకంగా కొనసాగేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.



పెద్దకడ్మూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఆర్జేడీ విజయలక్ష్మి

'మన ఊరు- మన బడి' పనులు త్వరగా చేపట్టాలి

నర్వ: మన ఊరు– మన బడి కార్యక్రమం ద్వారా ఎంపికైన 9 పాఠశాలలో అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలని ఆర్జేడీ విజయలక్ష్మి సూచించారు. సోమవారం మండలంలోని పెద్దకడ్మూర్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో చేపట్టిన పనులను ఆమె డీఈఓ గోవిందరాజులుతో కలిసి పరిశీలించారు. పాఠశాలలో పనుల వివరాలను హెచ్‌ఎం నర్సింహులును అడిగి తెలుసుకున్నారు. పనులను నాణ్యతతో చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో తొలిమెట్టు కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులు చేపట్టిన బోధనాభ్యాస ప్రక్రియలను, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో చదవడం, రాయడం వంటి ప్రక్రియలను అడిగి తెలుసుకున్నారు. ఏఎంఓ విద్యాసాగర్, సెక్టోరియల్ అధికారి శ్రీనివాసులు, మణెమ్మ ఉన్నారు.

విద్యావిధానంలో మార్పు రావాలి

- పీఆర్‌టీయూ తెలంగాణ సదస్సులో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి



ఏఎంఓగా, సెక్టోరియల్ అధికారులుగా పనిచేసిన చంద్రశేఖర్, గణేష్‌లను సన్మానిస్తున్న మంత్రి, ఎమ్మెల్సీ

వనపర్తిటౌన్: దేశ వ్యాప్తంగా 10+2 వరకు విద్యావిధానంలో మార్పులు రావాల్సిన అవసరం ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. మెరుగైన విద్యావిధానం కోసం లోతైన చర్చ జరగాల్సిన అవసరం ఉందని, ఇందుకు ఉపాధ్యాయులు శ్రీకారం చుట్టాలన్నారు. పీఆర్‌టీయూ తెలంగాణ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని ఎంవైఎస్ బ్యాంకెట్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యావిధానంపై విస్తృత చర్చ ద్వార భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనప్పటికీ వ్యక్తపరిచే అభిప్రాయాలకు ప్రాతిపదిక ఉంటే సమాజం సమర్థించాల్సిన పరిస్థితులు వస్తాయని, ఇందుకు తెలంగాణ ఉద్యమమే సాక్ష్యమని పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో దేశాధినేతల పిల్లల నుంచి మొదలుకొని సామాన్యుల వరకు నివసించే పరిధిలోనే విద్యను 95శాతం ప్రభుత్వ రంగంలోనే పొందాలని, ఇందుకు కఠిన నిబంధనలుంటాయని గుర్తు చేశారు. దేశంలో బాల్యం నుంచే విద్యావ్యవస్థలో సంస్కరణలు చేపడితే భవిష్యత్ ప్రపంచాన్ని తట్టుకునే సమర్థత కొత్త యువతరంలో వస్తుందన్నారు. ఉపాధ్యాయులు పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా సామాజిక స్పృహతో సమకాలీన అంశాలను అనుసంధానం చేస్తూ.. విద్యనందించాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులపై నిశ్చింతగా ఉండాలని కోరారు. ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. అనంతరం పీఆర్‌టీయూ తెలంగాణ 2023 డైరీని ఆవిష్కరించి, సెక్టోరియల్, ఏఎంఓలుగా ఐదేళ్లుగా నిజాయితీగా విద్యాశాఖలో సేవలందించారని పేర్కొంటూ చంద్రశేఖర్, గణేష్‌లను పూలమాల, శాలువాతో సన్మానించారు. మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ శ్రీధర్, రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి అంజిరెడ్డి, గౌరవాధ్యక్షుడు సత్యనారాయణ, డీఈఓ రవీందర్, పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో చండీయాగం

- నేడు శకటోత్సవం

నవాబుపేట: మండల పరిధిలోని మైసమ్మ అడవి వేదమంత్రాలతో మారుమోగింది. సోమవారం దేవాలయ ఉత్సవాల్లో భాగంగా చండీయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు ప్రత్యేకంగా అమ్మవారిని అలంకరించి యాగం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్, దేవాలయ అధికారి మదనేశ్వర్‌రెడి పూర్ణాహుతి నిర్వహించారు. మంగళవారం దేవాలయ ఉత్సవాల్లో భాగంగా శకటోత్సవం, 116 బోనాలతో నైవేద్యాల సమర్పణ ఉంటుందని దేవాలయ చైర్మన్, ఈఓ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జంగమ్మ, నర్సింహులు, మాజీ సర్పంచ్ లక్ష్మీదేవి, కృష్ణయ్య, అంజయ్య, మాధవులు, నరేందర్, సంజీవరెడ్డి, కృష్ణయ్య, శ్రీనివాస్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



మైసమ్మ ఆలయంలో చండీయాగం నిర్వహిస్తున్న భక్తులు